సాక్షి
కాకినాడ
సోమవారం | 28 | ఆగస్టు | 2023



రూ.1.50 లక్షల విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో నిత్యాన్నదానానికి సాగి విఠల్ రంగ రాజు, కుటుంబ సభ్యులు (భీమవరం) ఆదివారం రూ.1.50 లక్షల విరాళం సమర్పించారు.



శ్రీవారికి రూ.లక్ష సమర్పణ

ద్వారకా తిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు దేవరకొండ వేంకటశాస్త్రి (పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలి) ఆదివారం రూ.లక్ష విరాళం సమర్పించారు.

సముద్రంలోకి 2.44 లక్షల క్యూసెక్కులు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి ఆదివారం 2,44,726 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. డెల్టా కాలువలకు 10,600 క్యూసెక్కులు వదిలారు. ఇందులో తూర్పు డెల్టాకు 4,200, మధ్య డెల్టాకు 2,400, పశ్చిమ డెల్టాకు 4 వేల క్యూసెక్కుల చొప్పున విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.05 అడుగులకు చేరింది.

అసమ్మతి సేనాని!

- జనసేన నేతలకు ఝలక్ ఇచ్చి బాధ్యతలు కొట్టేసిన కొత్త నేత
- 'దేశం' మాజీ ఎమ్మెల్యే వర్మ వ్యతిరేక వర్గంతో మంతనాలు
- టీడీపీలో 'టీటైమ్' బాంబ్
- ఇరు పార్టీల కార్యకర్తల్లో అయోమయం



ఇటీవల మాజీ ఎమ్మెల్యే వర్మ వ్యతిరేక వర్గానికి చెందిన టీడీపీ నేతలను కలిసిన జనసేన నేత తంగెళ్ల

పిఠాపురం: ఒక ఒరలో రెండు కత్తులు ఇమడవనేది నానుడి. దీనికి తగినట్టుగానే పిఠాపురం నియోజకవర్గంలో టీడీపీ, జనసేనల మధ్య అసమ్మతి సెగ రోజురోజుకూ రాజుకుంటోంది. టీడీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మపై ఆ పార్టీ నేతలు గతంలో అసమ్మతి బావుటా ఎగురవేశారు. సాక్షాత్తూ ఆ పార్టీ అధినేత చంద్రబాబు వద్దే అసమ్మతి పంచాయితీ పెట్టారు. మరోపక్క జనసేనలో కూడా నియోజకవర్గ ఇన్‌చార్జి మార్పు ఆ పార్టీలో ఒక్కసారిగా అసమ్మతిని లేపింది. పాత నేతలు జోరుగా తిరుగుతున్న సమయంలో కొత్త వారికి పార్టీ పగ్గాలు అప్పగించడంపై తీవ్ర అసంతృప్తులు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ రెండు పార్టీల్లోని అసమ్మతి నేతలు కలుస్తూండటం ఇరు పక్షాల కార్యకర్తల్లో కలవరం రేపుతోంది.

తంగెళ్ల అండతో..

గత సార్వత్రిక ఎన్నికల తరువాత పిఠాపురంలో జనసేన పార్టీ అసలుందా అనే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహించిన మాకినీడి శేషుకుమారి అడపాదడపా కనిపిస్తూ ఉన్నానని అనిపించుకునే ప్రయత్నాలు చేసేవారు. ఈ పరిస్థితుల్లో జనసేనకు ఆర్థిక అండగా ఉంటూ.. అధినేత వద్ద తన మాటే వేదం అనిపించుకుంటున్న వ్యాపారవేత్త, టీటైమ్ అధినేత తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌ను.. అప్పట్లో పిఠాపురానికి చెందిన కొందరు కొత్త నేతలు కలిశారని చెబుతున్నారు. నియోజకవర్గంలో పార్టీ కార్యకలాపాలు నిర్వహించాలని, పనితీరు బాగున్న వారికి సీటు ఇప్పించే బాధ్యత తనదని నాడు ఆయన భరోసా ఇచ్చారని అంటున్నారు. ఈ నేపథ్యంలో ఆయన అండతో కొందరు జనసేన నేతలు కొన్ని నెలలుగా అంతా తామే అన్నట్టు ఖర్చు రూపాయి.. ప్రచారం రూ.10 వేలు అనే రీతిలో హడావుడి చేశారు. ఎలాగూ ఉన్న ఇన్‌చార్జిపై అసమ్మతి వ్యక్తం చేయడంతో తమలో ఎవరికో ఒకరికి కచ్చితంగా సీటు వచ్చేస్తుందని ప్రయత్నాలు తీవ్రతరం చేశారు. ఎలాగూ తంగెళ్ల మద్దతు ఉంది కాబట్టి తమకిక అడ్డం లేదని భావించారు.

అసమ్మతి వర్గానికి జెల్ల

సరిగ్గా అదే తరుణంలో అసమ్మతి నేతలందరికీ తంగెళ్ల ఓ జెల్ల కొట్టారు. హఠాత్తుగా ఆయనే నేరుగా ఇక్కడ దిగిపోయారు. దీంతో ఈ సీటు కోసం ఆయనను నమ్ముకున్న జనసేన అసమ్మతి నేతలు ఒక్కసారిగా కంగు తిన్నారు. తంగెళ్ల తమను నమ్మించి, నట్టేట ముంచారంటూ అసహనం వ్యక్తం చేశారు. అప్పటి నుంచీ స్థానిక నేతలు ఆ పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటూ తమ అసమ్మతిని బహిరంగంగానే తెలియజేస్తున్నారు. ఇదిలా ఉండగా కొన్నాళ్ల కిందట మాకినీడి శేషుకుమారిని తప్పించి, పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలను తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌కు అధినేత పవన్ కల్యాణ్ అప్పగించారు. దీంతో ఆ పదవి ఆశించిన నేతలు భంగపాటుకు గురయ్యారు. ఈ పరిణామాలు జనసేన పార్టీలో అసమ్మతిని మరింత రాజేశాయి.

పొత్తులంటూనే..

ఇదిలా ఉండగా స్థానిక జనసేన నాయకులతో సంబంధం లేకుండా కొత్త నేత తంగెళ్ల.. టీడీపీ మాజీ ఎమ్మెల్యే వర్మ వ్యతిరేక వర్గ నాయకులను కలుసుకుంటున్నారు. రెండు రోజుల కిందట కొంతమంది వర్మ వ్యతిరేక వర్గానికి చెందిన నేతలను నేరుగా కలవగా.. మరికొంత మందితో ఫోనులో చర్చిస్తున్నారు. మరోవైపు టీడీపీ నేత వర్మ కూడా జనసేనలోని అసమ్మతి నాయకులతో లోపాయికారీగా మంతనాలు జరుపుతున్నారని చెబుతున్నారు. ఈ పరిణామాలు ఈ రెండు పార్టీల్లోనూ చర్చనీయాంశంగా మారాయి. ఒకపక్క పొత్తులంటూనే టీడీపీ, జనసేన నేతలిద్దరూ.. పరస్పరం అవతలి పార్టీలోని అసమ్మతి నేతలకు గాలం వేయాలని చూడటంపై రెండు పార్టీల కార్యకర్తలూ అయోమయానికి గురవుతున్నారు.

టీడీపీ నేతల్లో కలవరం

జనసేన ఇన్‌చార్జి మార్పుతో పిఠాపురం టీడీపీ నేతల్లో ఆలజడి ప్రారంభమైందనేది బహిరంగం రహస్యం. జనసేనతో పొత్తు కుదిరినా సరే తనదే సీటు అంటూ మాజీ ఎమ్మెల్యే వర్మ ఇప్పటికే బహిరంగంగా ప్రకటించుకున్నారు. ఈ తరుణంలో జనసేన ఇన్‌చార్జిగా తంగెళ్లను నియమించడం, ఆయన వర్మ అసమ్మతి నేతలను వారి ఇళ్లకు వెళ్లి మరీ కలవడం టీడీపీ నేతల్లో కలవరం రేపుతోందని అంటున్నారు. రెండు పార్టీల మధ్య పొత్తు కుదిరితే పిఠాపురం జనసేనకే ఇవ్వాలని కోరినట్టు చెబుతున్నారు. అది కూడా తంగెళ్లకే ఇచ్చేందుకు హామీ ఇచ్చి మరీ ఇన్‌చార్జి పదవి కట్టబెట్టినట్టు ప్రచారం జరుగుతోంది. అయితే, దీనికెలా అంగీకరిస్తామంటూ టీడీపీ నేతలు తిరుగుబాటు బావుటా ఎగురవేసేందుకు రంగం సిద్ధ చేసుకుంటున్నారని తెలుస్తోంది.

జనసేనకు ఈ నియోజకవర్గం కేటాయిస్తే టీడీపీ రెబల్ బాధ తప్పదని ఆ పార్టీ నేతలే బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు. మరోపక్క తమకు ఆశలు కల్పించి, ఝలక్ ఇచ్చిన తంగెళ్లకు టిక్కెట్ ఇస్తే తామెలా సహకరిస్తామంటూ జనసేన నాయకులూ అసమ్మతి గళం వినిపిస్తున్నారు. ఎవరినో తీసుకువచ్చి టిక్కెట్ ఇస్తే ఓట్లు వేయడానికి సిద్ధంగా లేమని ఆ పార్టీ కార్యకర్తలు ఢంకా బజాయించి మరీ చెబుతున్నారు. ఈ నేపథ్యంలో పొత్తు సంగతెలా ఉన్నా నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి మార్పు రెండు పార్టీల్లోనూ తీవ్ర కలవరానికి తెర లేపిందనే చెప్పాలి. మరోవైపు టీడీపీలోని వర్మ అసమ్మతి నేతలను తంగెళ్ల కలవడం కూడా ఈ రెండు పార్టీల మధ్య అగ్గి రాజేసిందనే ప్రచారం ఎక్కువగా జరుగుతోంది.

నేడు జగనన్న విద్యా దీవెన

- జిల్లాలో 36,090 మంది విద్యార్థులకు లబ్ధి
- వారి తల్లుల ఖాతాల్లో రూ.24,63,37,848 జమ
- నగరి నుంచి ప్రారంభించనున్న సీఎం జగన్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): కేవలం చదువుతోనే పేదల తలరాతలు మారుతాయని, పిల్లలకు మనం ఇచ్చే గొప్ప ఆస్తి చదువేనని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తరచూ చెబుతారు. ప్రతి ఒక్కరూ చదువుకోవాలనే ఉద్దేశంతో రాష్ట్రంలో ఆయన విద్యా విప్లవాన్ని తీసుకుని వచ్చారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ ఒక్క విద్యార్థీ ఉన్నత చదువులకు దూరం కాకూడదనే ఉద్దేశంతో 'జగనన్న విద్యా దీవెన' పథకాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సమర్థవంతంగా అమలు చేస్తున్నారు. ఈ పథకం ద్వారా ఇంటర్మీడియెట్ తర్వాత పై చదువులు చదివే విద్యార్థులకు ఆర్థిక సాయం అందిస్తున్నారు. బీటెక్, ఎంటెక్, బీ ఫార్మసీ, ఎంబీఏ, ఎం ఫార్మసీ తదితర ఉన్నత చదువులు చదువుతున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్(జగనన్న విద్యా దీవెన) అందిస్తున్నారు. విద్యా సంవత్సరంలో ప్రతి త్రైమాసికానికి సంబంధించిన కళాశాలల ఫీజులను ఆ త్రైమాసికంలోనే చెల్లిస్తూండటంతో పేద విద్యార్థుల చదువులు సాఫీగా సాగుతున్నాయి. చిత్తూరు జిల్లా నగరిలో సోమవారం జరిగే బహిరంగ సభలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కంప్యూటర్ బటన్ నొక్కి విద్యార్థుల తల్లుల ఖాతాల్లో 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించి మూడో విడత జగనన్న విద్యా దీవెన సొమ్ము జమ చేయనున్నారు. ఈ పథకం కింద జిల్లాలోని 36,090 మంది విద్యార్థుల తల్లుల ఖాతాలకు రూ.24,63,37,848 మేర జమ చేయనున్నారు.

నియోజకవర్గం	విద్యార్థులు	నిధులు (రూ.లలో)
కాకినాడ సిటీ	6,002	4,29,51,322
కాకినాడ రూరల్	5,108	3,69,60,692
పెద్దాపురం	5,026	3,50,35,918
పిఠాపురం	6,137	4,11,18,209
ప్రత్తిపాడు	4,737	3,02,03,270
జగ్గంపేట	3,611	2,42,97,570
తుని	5,469	3,57,70,857



కొవ్వూరులో రెండో విడత విద్యా దీవెన నగదు పంపిణీ చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి (ఫైల్)

అర్హులందరికీ జమ



అర్హత ఉన్న ప్రతి విద్యార్థికీ జగనన్న విద్యా దీవెన మూడో విడత సొమ్ములు అందేలా చర్యలు తీసుకున్నాం. కలెక్టరేట్‌లో ప్రజాప్రతినిధులు, అధికారుల ఆధ్వర్యాన సోమవారం జిల్లా స్థాయి కార్యక్రమం నిర్వహిస్తాం.

– డీవీ రమణమూర్తి, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి

త్వరలో జ్యోతిర్మయి వ్రతం

- సత్యదేవుని సన్నిధిలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు
- వ్రత సమయం మూడు నాలుగు గంటలు
- 45 జ్యోతులతో 45 మంది దేవతలకు పూజలు
- సత్యదేవునితో పాటు నవగ్రహాలకూ అష్టోత్తర పూజలు
- ప్రత్యేక పుష్పాలు, నివేదనలు



సత్యదేవుని వ్రతాలాచరిస్తున్న భక్తులు (ఫైల్)

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో త్వరలో విశిష్టమైన మరో సరికొత్త వ్రతానికి శ్రీకారం చుట్టనున్నారు. 'సత్యదేవుని జ్యోతిర్మయి వ్రతం' పేరిట దీనిని నిర్వహించేందుకు చురుకుగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ వ్రతం నిర్వహణకు కావాల్సిన పూజాసామగ్రి, ప్రసాదాలు వంటి వాటిపై దేవస్థానం పండితుల నుంచి నివేదిక కోరామని దేవస్థానం ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ ఆజాద్ ఆదివారం విలేకర్లకు తెలిపారు.

సత్యదేవుని వ్రతానికి దేశవ్యాప్తంగా ఎంతో ప్రాధాన్యం ఉంది. వివాహం అనంతరం, గృహప్రవేశం తరువాత స్వామివారి వ్రతం ఆచరించడం తెలుగు రాష్ట్రాల్లో ఆనవాయితీగా వస్తున్న విషయం తెలిసిందే. ఏటా దేవస్థానంలో సుమారు 7 లక్షల వ్రతాలు జరుగుతున్నాయి. వీటి నిర్వహణకు 260 మంది పురోహితులు దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్నారు. వీరు కాకుండా మరో 40 మంది అదనంగా సేవలందిస్తున్నారు. రూ.2 వేలు, రూ.1,500, రూ.800, రూ.300 టికెట్లపై ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ వ్రతాలు నిర్వహిస్తున్నారు.

ఎంతో విశిష్టం

ప్రస్తుతం జరుగుతున్న వ్రతాలకు అదనంగా.. రత్నగిరిపై కొత్తగా సత్యదేవ జ్యోతిర్మయి వ్రతాలు నిర్వహించాలని నిర్ణయించారు. సత్యదేవుని సన్నిధిలో ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం చేస్తున్న సత్యదేవుని వ్రతంతో పోల్చితే ఇది చాలా విశిష్టమైనదని పండితులు చెబుతున్నారు. సత్యదేవుని వ్రతం ఆచరించడానికి సుమారు గంటన్నర సమయం పడితే జ్యోతిర్మయి వ్రతానికి మూడు నాలుగు గంటలు పడుతుందని అంటున్నారు.

- సాధారణ వ్రతంలో నవగ్రహాలు, పంచ భూతాలు, అష్టదిక్పాలకులు.. ఇలా 45 మంది దేవతలు, ప్రత్యధిదేవతలకు తాంబూలాలు మాత్రమే సమర్పిస్తారు. జ్యోతిర్మయి వ్రతంలో ఈ 45 మంది దేవతలకూ జ్యోతులు వెలిగించి, ఆవాహన చేస్తారు.
- ఈ వ్రతంలో ఉపయోగించే గావంచా (నేలపై మంటపానికి వేసే వస్త్రం) పొడవు అర మీటరు పొడవు, అర మీటరు వెడల్పు ఉంటుంది. దానిపై బియ్యం వేసి, గౌరీ దేవిని ప్రతిష్ఠించి, ఆపై పండితుల మంత్రోచ్చారణల నడుమ దేవతలను ఆవాహన చేస్తారు. తమలపాకులపై దీపపు సెమ్మెలు ఉంచి జ్యోతులు వెలిగిస్తారు.
- సత్యదేవుని జ్యోతిర్మయి వ్రతంలో భాగంగా నవగ్రహాలకు తొమ్మిది రకాల పుష్పాలతో పూజలు చేస్తారు. అలాగే, తొమ్మిది రకాల నివేదనలు సమర్పిస్తారు. నవగ్రహాలకు కూడా అష్టోత్తర పూజలు నిర్వహిస్తారు.
- ఈ వ్రతం చేయించేందుకు ప్రత్యేక శిక్షణ పొందిన పురోహితులు అవసరం. వ్రతాలాచరించే భక్తుల జంట వద్ద పురోహితుడు ఉండి, మొదటి నుంచి చివరి వరకూ దీనిని నిర్వహిస్తారు. స్వామివారి వ్రత కథను అందరికీ కలిపి ఒక పురోహితుడు చెబుతారు.
- చివరిలో స్వామి, అమ్మవార్లకు వేద పండితుల ఆశీస్సులు, అనంతరం ప్రసాద వితరణతో వ్రతం ముగుస్తుంది.
- జ్యోతిర్మయి వ్రతంలో పూజాద్రవ్యాలు, ప్రసాదాలు, వ్రత సామగ్రికే సుమారు రూ.4 వేల వ్యయమవుతుందని అంచనా.


మహిమాన్విత వ్రతం



సత్యదేవుని జ్యోతిర్మయి వ్రతం చాలా మహిమాన్వితమైనది. కోరిన కోర్కెలు తీర్చే వ్రతమిది. 25 సంవత్సరాల క్రితం అప్పటి సత్యదేవుని ఆలయ ప్రధానార్చకుడు దేవులపల్లి నారాయణ, వ్రతబ్రహ్మ పాలంకి పట్టాభి రామ్మూర్తి, వేద పండితులు ఇరగవరపు లక్ష్మీనృసింహాచార్యులు ఈ వ్రతం చేయించారు. ఈ వ్రతంలో సత్యదేవుడిని జ్యోతి స్వరూపుడిగా భావిస్తారు. ప్రతి గ్రహాధిదేవత, ప్రత్యధిదేవత, దిక్పాలకులు, పంచభూతాలకు జ్యోతులు వెలిగించి పూజ చేస్తారు. నవగ్రహాలకు ఇష్టమైన పూలతో పూజలు చేసి, ఇష్టమైన దినుసులు నివేదిస్తారు.

– చామర్తి కన్నబాబు, సత్యదేవుని కల్యాణబ్రహ్మ, దేవస్థానం వైదిక కమిటీ సభ్యుడు

దసరా నుంచి ప్రారంభించే అవకాశం



సత్యదేవుని జ్యోతిర్మయి వ్రతం చాలా విశిష్టమైంది. దీనిని గతంలో పండితులు తమ ఇళ్ల వద్ద నోచుకునేవారు. ఇప్పుడు ఈ వ్రతాన్ని రత్నగిరిపై నిర్వహించాలని నిర్ణయించాం. ఇందుకోసం పాత అకౌంట్స్ విభాగాన్ని జ్యోతిర్మయి వ్రత మంటపంగా సిద్ధం చేస్తాం. ఏసీ సౌకర్యం కల్పిస్తాం. వ్రతానికి అవసరమైన సామగ్రిపై నివేదిక ఇవ్వాలని పండితులను ఆదేశించాం. వచ్చే నెలాఖరుకల్లా వ్రత మంటపం తయారవుతుంది. ఈ వ్రతం టిక్కెట్టు రూ.7 వేల నుంచి రూ.10 వేల వరకూ ఉండే అవకాశం ఉంది. వచ్చే దసరా నుంచి దీనిని ప్రారంభించే అవకాశం ఉంది.

– ఎస్ఎస్ చంద్రశేఖర ఆజాద్, ఈఓ, అన్నవరం దేవస్థానం

న్యూస్‌రీల్

జగనన్న కాలనీని పరిశీలించిన మంత్రి అమర్‌నాథ్



జగనన్న కాలనీని పరిశీలిస్తున్న మంత్రి అమర్‌నాథ్, దవులూరి దొరబాబు

సామర్లకోట: స్థానిక ప్రత్తిపాడు రోడ్డు ఈటీసీ లేఅవుట్‌లో నిర్మాణంలో ఉన్న జగనన్న కాలనీని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆదివారం పరిశీలించారు. వ్యక్తిగత పనిపై సామర్లకోట వచ్చిన ఆయన.. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబుతో కలిసి జగనన్న కాలనీని పరిశీలించారు. ఈ కాలనీలో 2,444 ఇళ్ల నిర్మాణం జరుగుతోందని మంత్రికి దొరబాబు తెలిపారు. సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి త్వరలో సామర్లకోట రానున్న సందర్భంగా కాలనీలో జరుగుతున్న పనులను మంత్రి పరిశీలించి, దొరబాబును అభినందించారు. కాలనీలో నిర్మిస్తున్న ఆర్చ్, దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం ఏర్పాటు చేసే ప్రదేశాలను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు ఊబా జాన్‌మోజెస్, నెక్కంటి సాయిప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు వీరంరెడ్డి నాని, పట్టణ సచివాలయాల కన్వీనర్ ఇరుసుమళ్ల సాయి, కౌన్సిలర్లు పితాని కృష్ణ, సాగా సురేష్‌కుమార్, జట్ల మోహన్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు ఏడీబీ రోడ్డులోని రాక్ సిరామిక్స్ పరిశ్రమను మంత్రి అమర్‌నాథ్ సందర్శించారు. పరిశ్రమ ప్రతినిధులు టి.నీరజ్‌కుమార్, రాజేంద్రసింగ్ మాన్, పీఆర్‌ఓ వీజీఎస్ కుమార్ పాల్గొన్నారు. అనంతరం 28వ వార్డులో బాల్య స్నేహితుడు రోహిత్ సమృద్ కుటుంబ సభ్యులను మంత్రి కలుసుకున్నారు.

నేడు స్పందన

కాకినాడ సిటీ: జగనన్నకు చెబుదాం – జిల్లా స్థాయి స్పందన కార్యక్రమం సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి కలెక్టరేట్ స్పందన హాలులో జరుగుతుంది. కలెక్టర్ కృతికా శుక్లా ఆదివారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. అలాగే, మంగళవారం ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకూ డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం నిర్వహించనున్నామని పేర్కొన్నారు. టోల్‌ఫ్రీ నంబర్ 1800 425 3077కు ఫోన్ చేసి ప్రజలు తమ సమస్యలను నేరుగా తనకు తెలియజేయవచ్చన్నారు.

లోవకు భక్తుల తాకిడి

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారిని దర్శించేందుకు వచ్చిన భక్తులతో లోవ దేవస్థానంలో ఆదివారం సందడి నెలకొంది. అమ్మవారిని క్యూలో 15 వేల మంది దర్శించుకున్నారని కార్యనిర్వహణాధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయం ద్వారా రూ.1,14,720, పూజా టికెట్లకు రూ.1,03,950, కేశఖండనశాలకు రూ.13,120, వాహన పూజలకు రూ.5,550, కాటేజీలు, పొంగలి షెడ్లు, వసతి గదుల అద్దెలుగా రూ.86,152, విరాళాలు రూ.1,68,110 కలిపి అమ్మవారికి మొత్తం రూ.4,91,602 ఆదాయం సమకూరిందని వివరించారు.

835 క్యూసెక్కుల విడుదల

ఏలేశ్వరం: ఏలేరు జలాశయం నుంచి **ఆది**వారం 835 క్యూసెక్కుల నీటిని విడు**దల** చేశారు. ఆయకట్టుకు 600, తిమ్మరాజు **చెరు**వుకు 100, విశాఖ నగరానికి 135 క్యూసెక్కు**ల** చొప్పున విడుదల చేశారు. నీటిని విడు**దల** చేస్తూండటం, పరీవాహక ప్రాంతంలో **ఆశిం**చిన స్థాయిలో వర్షాలు కురవకపోవడ**ంతో** జలాశయంలో నీటి నిల్వలు స్వల్పంగా తగ్గాయి. రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటిమట్టం 86.56 మీటర్లు కాగా, ప్రస్తుతం 74.70 మీటర్లుగా నమోదైంది. జలాశయం సామర్థ్యం 24.11 టీఎంసీలు కాగా, 8.05 టీఎంసీల మేర నీటి నిల్వలున్నాయి.

సివిల్ సర్వీసెస్ క్రీడా పోటీలకు 30న ఎంపికలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా క్రీడా మైదానంలో ఈ నెల 30న సివిల్ సర్వీసెస్ క్రీడాకారుల జిల్లా స్థాయి ఎంపికలు నిర్వహించనున్నారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్ఏ) ముఖ్య శిక్షకుడు శ్రీనివాస్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, క్యారమ్స్, చెస్, క్రికెట్, ఫుట్‌బాల్, హాకీ, కబడ్డీ, లాన్‌టెన్నిస్, స్విమ్మింగ్, ఖోఖో, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, టేబుల్ టెన్నిస్, యోగా, రెజ్లింగ్, వాలీబాల్ అంశాల్లో ఎంపికలు ఉంటాయని వివరించారు. ఆసక్తి ఉన్న పురుషులు, మహిళలు ఆ రోజు ఉదయం 8 గంటలకు వయస్సు, అర్హత పత్రాలతో జిల్లా క్రీడా మైదానంలో హాజరు కావాలని కోరారు.

స్కూల్ కాంప్లెక్స్ సమావేశం 30కి వాయిదా

జిల్లా వ్యాయామోపాధ్యాయుల నియోజకవర్గ స్కూల్ కాంప్లెక్స్ సమావేశం ఈ నెల 30కి వాయిదా వేశారు. రాష్ట్ర వ్యాయామోపాధ్యాయ సంఘం అధ్యక్షుడు ఎల్.జార్జి ఆదివారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు.

సమష్టిగా పని చేద్దాం.. నిత్యం ప్రజల్లో ఉండాలి

పార్టీ శ్రేణులకు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కన్నబాబు విజ్ఞప్తి



కన్నబాబును అభినందిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ తదితరులు

కాకినాడ రూరల్: 'సమష్టిగా పని చేద్దాం – నిత్యం ప్రజల్లో ఉండాలి' అని పార్టీ శ్రేణులకు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు విజ్ఞప్తి చేశారు. మూడోసారి కూడా పార్టీ జిల్లా పగ్గాలు చేపట్టిన ఆయనను జిల్లా నలుమూలల నుంచీ వచ్చిన పలువురు రమణయ్యపేటలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం కలిసి, అభినందించారు. ఈ సందర్భంగా వారితో కన్నబాబు మాట్లాడుతూ, ఎన్నికల సంవత్సరం కావడంతో ప్రతి ఒక్కరూ పార్టీ కోసం కష్టపడి పని చేయాలని సూచించారు. ప్రజల్లో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, ఎవరికైనా సంక్షేమ పథకాలు అందకుంటే అందుకు కారణాలు తెలుసుకుని, పరిష్కరించాలని అన్నారు. ప్రజలకు అవసరమయ్యే మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను నాయకులు, ప్రజాప్రతినిధులు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కన్నబాబు సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నురుకుర్తి రామకృష్ణ, నాయకులు పుల్ల చందు, కోమలి సత్యనారాయణ, లింగం రవి, గౌడ సంఘ జిల్లా నాయకుడు గణేష్, యాదవ సంఘ నాయకులు రామలక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకు, సోలార్ విద్యుత్ ఏర్పాటు చేయరూ..



గెయిల్ మేనేజర్, నెడ్‌క్యాప్ పీడీలకు వినతి అందజేస్తున్న ఈఓ విశ్వనాథరాజు

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారి లోవ దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం వాటర్ ట్యాంకు, సోలార్ విద్యుత్ ప్రాజెక్టు ఏర్పాటు చేయాలని ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు గెయిల్, నెడ్‌క్యాప్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. తలుపులమ్మ అమ్మవారిని దర్శించేందుకు గెయిల్ మేనేజర్ బాలాజీ, నెడ్‌క్యాప్ పీడీ సత్యనారాయణ ఆదివారం లోవ దేవస్థానానికి వచ్చారు. దర్శనానంతరం వారికి పండితులు వేదాశీస్సులు అందజేశారు. అనంతరం వారిని ఈఓ విశ్వనాథరాజు తన కార్యాలయానికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ, లోవకు భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగిందని అన్నారు. దీనికి అనుగుణంగా దేవస్థానంలో వాటర్ ట్యాంకు, విద్యుత్ సమస్యల పరిష్కారానికి సోలార్ విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాల్సి ఉందని వివరించారు. ఈ రెండింటి ఏర్పాటుకు గెయిల్ సహకరించాలని కోరారు. దీనికి గెయిల్ మేనేజర్ బాలాజీ, నెడ్‌క్యాప్ పీడీ సత్యనారాయణ సానుకూలంగా స్పందించారని ఈఓ తెలిపారు. ఇందుకు అవసరమైన ప్రాజెక్టు రిపోర్టు అందజేస్తామని చెప్పారు.

చదువుతో పాటు క్రీడలూ ముఖ్యం



క్రీడాకారులనుద్దేశించి మాట్లాడుతున్న గోవిందరాజు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ముఖ్యమని జిల్లా ఒలింపిక్ సంఘం చైర్మన్ చుండ్రు గోవిందరాజు అన్నారు. ఈ నెల 29న హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతి, జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి పర్యవేక్షణలో విద్యార్థులకు ఆదివారం వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా కాకినాడ క్రీడా మైదానంలో హాకీ, జిమ్నాస్టిక్స్, జగ్గంపేటలో జూడో పోటీలు జరిగాయి. హాకీ పోటీలను గోవిందరాజు, ఒలింపిక్ సంఘం ప్యాట్రన్ కర్రి భామిరెడ్డి ప్రారంభించారు. గోవిందరాజు మాట్లాడుతూ, విద్యార్థులు తమ క్రీడాప్రతిభను నిరూపించుకోవడానికి ఈ పోటీలు దోహదపడతాయని అన్నారు. ధ్యాన్‌చంద్‌ను స్ఫూర్తిగా తీసుకుని క్రీడల్లో రాణించాలని భామిరెడ్డి కోరారు. ఒలింపిక్ సంఘం కార్యదర్శి, రంగరాయ వైద్య కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ కె.స్పర్జన్‌రాజు మాట్లాడుతూ, క్రీడల్లో రాణించే వారు ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని అన్నారు. అనంతరం క్రీడాకారులను అతిథులు పరిచయం చేసుకుని హాకీ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో సంఘం జాయింట్ సెక్రటరీ డాక్టర్ జి.ఎలీషాబాబు, పీఈటీ సంఘం జిల్లా అధ్యక్షుడు వి.రవిరాజు, ఒలింపిక్ సంఘ సభ్యులు కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మాణిక్యాంబ అమ్మవారికి స్వర్ణమకర తోరణం



స్వర్ణ మకర తోరణంతో దాత పంపన లక్ష్మణ కుమార్, శిల్పి మురళీ, ఈఓ తారకేశ్వరరావు

రామచంద్రపురం రూరల్: పంచారామ క్షేత్రాల్లో ఒకటిగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో అష్టాదశ శక్తి పీఠం మాణిక్యాంబా అమ్మవారి సన్నిధిలో స్వర్ణ మకర తోరణం ఏర్పాటు చేశారు. కె.గంగవరం మండలం కుందూరుకు చెందిన దాతలు పంపన లక్ష్మణకుమార్, కృష్ణవేణి దంపతుల సహకారంతో సుమారు రూ.12 లక్షలతో కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన ప్రముఖ స్వర్ణకారుడు మురళీ తయారు చేసిన స్వర్ణ మకర తోరణాన్ని మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్చారణల నడుమ రుత్వికులచే సంప్రోక్షణ చేసి అమ్మవారి చెంత అలంకరించారు. దాతలు లక్ష్మణకుమార్, కృష్ణవేణి, వారి కుమార్తెలు అనూష, హరిప్రియ, బంధు మిత్రులకు స్వామివారి, అమ్మవారి తీర్థప్రసాదాలు, జ్ఞాపికలను ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు అందజేశారు. ఆలయ అర్చకులు కల్లేపల్లి విశ్వప్రకాశ్, మద్దిరాల రఘునందన్, వేద పండితులు తదితరులు పాల్గొన్నారు.

భార్యకు మందులు కొనేందుకు వచ్చి..

లారీ ఢీకొని వ్యక్తి మృతి

రాయవరం: అనారోగ్యంతో ఉన్న భార్యకు మందులు కొనేందుకు వచ్చిన ఓ వ్యక్తిని లారీ ఢీకొనడంతో దుర్మరణం పాలయ్యాడు. ఈ హృదయ విదారక ఘటన రాయవరం మండలం సోమేశ్వరంలో చోటు చేసుకుంది. అనపర్తి మండలం పులుగుర్త గ్రామానికి చెందిన రేలంగి శేషారావు (52) కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శేషారావు భార్య పద్మకు అనారోగ్యంగా ఉండడంతో సోమేశ్వరంలోని మెడికల్ షాపులో మందులు తీసుకునేందుకు నడిచి వెళ్తున్నాడు. స్థానిక పోతురాజు గుడి వద్దకు వచ్చే సరికి శేషారావును మండపేట నుంచి సోమేశ్వరం వస్తున్న లారీ ఢీకొంది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఇదిలా ఉంటే శేషారావుకు భార్యతో పాటు ఇరువురు కుమార్తెలున్నారు. ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పి.వెంకటేశ్వరరావు తెలిపారు.

మనోళ్లు.. మంచి ఆటగాళ్లు

- అంతర్జాతీయ ఖ్యాతినార్జిస్తున్న క్రీడాకారులు
- కోనసీమకు ఆభరణం సాత్విక్ సాయిరాజ్
- గ్రామీణ క్రీడాభివృద్ధికి ప్రభుత్వం కృషి
- రేపు జాతీయ క్రీడా దినోత్సవం

కపిలేశ్వరపురం: మనోళ్లు మంచి ఆటగాళ్లు.. ఎందరో మరెందరో క్రీడా స్ఫూర్తిని చాటారు.. మన కీర్తి పతాకాన్ని ఎగురవేశారు. చరిత్రలో నిలిచే రికార్డులు సొంతం చేసుకున్నారు.. వారెవ్వా అనిపించేలా క్రీడల్లో దూసుకుపోతున్నారు.. క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో మన క్రీడాకారులు అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జిస్తున్నారు. క్షేత్ర స్థాయి నుంచి తమదైన శైలి ప్రదర్శిస్తున్నారు. హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని ఏటా ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవం జరుపుకొంటారు. మంగళవారం క్రీడా దినోత్సవం సందర్భంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో క్రీడా వైభవంపై ప్రత్యేక కథనం ఇది.

ఎగిరింది కీర్తిపతాకం

కోనసీమ జిల్లా వాసి అమలాపురానికి చెందిన అంతర్జాతీయ షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు రంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్ ఎందరికో స్ఫూర్తి. ఈ ఏడాది సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ జోడీ స్విస్ ఓపెన్, ఇండోనేషియా ఓపెన్, కొరియా ఓపెన్ డబుల్స్ టైటిళ్లను సాధించి ప్రధాని మోదీ, సీఎం జగన్ తదితరుల ప్రశంసలు అందుకున్నారు. జులైలో కొరియా ఓపెన్ డబుల్స్ టైటిల్‌ను గెలుచుకోగా ఆ టైటిల్‌ను గెలిచిన తొలి జోడీగా వారు చరిత్రకెక్కారు. అదే నెలలో జపాన్‌కు చెందిన ప్రముఖ క్రీడా ఉపకరణాల సంస్థ యోనెక్స్ తమ ఫ్యాక్టరీలో ఇటీవల నిర్వహించిన టెస్టులో సాత్విక్ రాకెట్ వేగంతో స్మాష్ కొట్టాడు. సాత్విక్ స్మాష్‌కు షటిల్ గంటకు 565 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లింది. బ్యాడ్మింటన్‌లో ఇది అసాధారణ వేగం. 2013లో మలేషియన్ షట్లర్ తన్ బూన్ హియాంగ్ గంటకు 493 కి.మీ వేగంతో స్మాష్ కొట్టాడు. ఈ వేగాన్ని సాత్విక్ అధిగమించడంతో ఫాస్టెస్ట్ స్మాష్ రికార్డును గిన్నిస్ బుక్‌లో లిఖించాడు.

ప్రోత్సాహం.. అమితం

రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ స్థాయి నుంచి క్రీడాకారులను ప్రోత్సహించే లక్ష్యంతో జగనన్న క్రీడా సంబరాలు, జగనన్న సంక్రాంతి సంబరాలు, సీఎం కప్ పోటీలు, ఆడుదాం ఆంధ్ర తదితర కార్యక్రమాలను రూపొందించి విజయవంతంగా అమలు చేస్తుంది. శాప్ ఆధ్వర్యంలో ఆడుదాం ఆంధ్ర



త్రివర్ణ పతాకంతో సాత్విక్ సాయిరాజ్

టోర్నీని అక్టోబర్ 2న గాంధీ జయంతి నుంచి గ్రామ సచివాలయ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ రూ.58.94 కోట్లతో 2.99 లక్షల మ్యాచ్‌లు నిర్వహించనుంది. ప్రతి పాఠశాల నుంచి కనీసం పది మంది విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేలా కార్యాచరణ రూపొందించింది. శాప్ ఆధ్వర్యాన మే 1 నుంచి 5 వరకూ తిరుపతిలో రాష్ట్ర స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను రూ.1.40 కోట్లతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. పురుషుల విభాగంలో ఉమ్మడి తూర్పుగోదావరి జట్టు బాస్కెట్‌బాల్, కబడ్డీలలో రన్నర్‌గా, బాల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, వెయిట్ లిఫ్టింగ్‌లలో మూడో స్థానం, మహిళల విభాగంలో బాల్ బ్యాడ్మింటన్, బాక్సింగ్‌లో రన్నర్‌గా, హాకీలో విన్నర్‌గా నిలిచారు. శాప్ ఆధ్వర్యంలో మే నెలలో విద్యార్థులకు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను నిర్వహించి 8–14 ఏళ్ల మధ్య వయసు కలిగిన బాల బాలికలకు సుమారు 25 క్రీడాంశాల్లో శిక్షణ ఇచ్చారు. జిల్లాకు 50 చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1,300 క్రీడా శిక్షణ శిబిరాలను నిర్వహించారు.

ప్రతిభ చాటిన వారెందరో..

అమలాపురంలో సాధనాల శ్రీనివాసరావు మెమోరియల్ పేరిట ఇటీవల ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు నందడిగా జరిగాయి. అమలాపురానికి చెందిన జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానికంగా మార్చి 11, 12లలో నిర్వహించిన 10వ రాష్ట్ర స్థాయి సీనియర్, జూనియర్ మెన్ అండ్ వుమెన్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్–2023 పోటీల్లో రాష్ట్రం నలుమూలల నుంచి 220 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఆగస్టు 3–6 మధ్య బల్గేరియాలో నిర్వహించిన బల్గేరియన్ బ్యాడ్మింటన్ జూనియర్ ఓపెన్ చాంపియన్‌షిప్ టోర్నమెంట్ అండర్–19 విభాగంలో మలికిపురానికి చెందిన కనపాల అభిషేక్ రజత పతకం సాధించాడు. జులై 4న విజయనగరంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్– 7 విభాగం చెస్ పోటీల్లో ఆలమూరు మండలం జొన్నాడకు చెందిన చిప్పాడ పోషణ రితిక అక్షయ ద్వితీయ స్థానంలో నిలిచింది. జూన్ 6న హర్యానాలోని రోహ్‌తక్‌లో నిర్వహించిన ఆలిండియా నేషనల్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో రన్నర్‌గా నిలిచి గంటి జెడ్పీ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థి నేలపూడి సుహాస్ రజత పతకం సాధించాడు. బీహార్‌లోని పాట్నాలో ఫిబ్రవరి 10 నుంచి 12 వరకూ నిర్వహించిన 18వ నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ అథ్లెటిక్స్‌లో యానాం నుంచి 8 మంది క్రీడాకారులు పాల్గొని ప్రతిభ కనబర్చారు. అమలాపురంలో జనవరి 12న యునైటెడ్ ఈస్ట్ గోదావరి డిస్ట్రిక్ట్ పవర్ లిఫ్టింగ్ కాంపిటీషన్ -2023 పేరుతో నిర్వహించిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి 110 మంది పాల్గొన్నారు. జనవరిలో కిమ్స్ క్రీడా మైదానంలో 10 రోజుల పాటు నిర్వహించిన అనురాధ ప్రీమియర్ లీగ్ టీ–20 క్రికెట్ పోటీల్లో విజేతగా అనురాధ వారియర్స్ జట్టు నిలిచింది. రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో జులై 21 నుంచి 23 వరకూ ఏపీ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 8వ సబ్‌జూనియర్స్ బాస్కెట్‌బాల్ అంతర్ జిల్లాల చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. రాజమహేంద్రవరంలో మే 16న నిర్వహించిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని గోదాసి శ్రీసంజనాదేవి ప్రతిభ కనబర్చింది. ఇలా అనేక మంది ప్రతిభ చాటారు.

ఆసక్తి ఉంటే విజయమే..



నేటి యువత ఆసక్తి కనబరిస్తే క్రీడల్లో అనుకున్న స్థాయికి చేరుకోవచ్చు. కోనసీమలో క్రీడాసక్తి కలిగిన యువకులెందరో ఉన్నారు. సాత్విక్ సాయిరాజ్ సాధిస్తున్న విజయాలు నాకు ఎంతో సంతోషాన్ని ఇస్తున్నాయి. దేశానికి మంచి పేరు తీసుకురావాలన్న లక్ష్యంతో సాత్విక్ ముందుకు సాగుతున్నాడు.

–రంకిరెడ్డి కాశీవిశ్వనాథ్, సాత్విక్ సాయిరాజ్ తండ్రి, అమలాపురం

ముందు వరుసలో మనం

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడ జిల్లాలో క్రీడాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. అందుకే క్రీడా సదుపాయాల పరంగా జిల్లా రాష్ట్రంలోనే ముందంజలో ఉంది. రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీల నిర్వహణకు అనువైన వేదికలు ఇక్కడున్నాయి. కాకినాడలో సుమారు 23 ఎకరాల విస్తీర్ణంలో రాష్ట్రంలోనే అతి పెద్ద క్రీడా మైదానం ఉంది. దీంతో పాటు తుని, సామర్లకోటలో ఇండోర్ స్టేడియాలు రెండు ఉన్నాయి. ఆయా చోట్ల సుమారు 1,500 మంది క్రీడాకారులు రోజూ వివిధ క్రీడల్లో శిక్షణ పొందుతున్నారు. కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో సుమారు రూ.7 కోట్లతో నిర్మించిన హాకీ యాస్ట్రో టర్ఫ్ మైదానం, రూ.కోటితో క్రీడా పరికరాలతో ఏర్పాటు చేసిన ఇండో జిమ్నాజియం, స్విమ్మింగ్ పూల్, ఇండోర్ బ్యాడ్మింటన్ కోర్టులు, రూ.2 కోట్లతో నిర్మించిన డార్మెటరీ ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తుందనడానికి నిదర్శనాలు. దేశంలో స్పోర్ట్స్ కోటాను పక్కాగా అమలు చేస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమే. రాష్ట్రంలోని గ్రామ, వార్డు, ఇతర ప్రభుత్వ శాఖల్లో స్పోర్ట్స్ కోటా అమలు ద్వారా సుమారు 2 శాతం మంది క్రీడాకారులు ఉద్యోగాలు సాధించారు. జిల్లా నుంచి ఇన్‌కమ్‌ట్యాక్స్, రైల్వే, ఆర్మీ, డీఎస్సీ, గ్రామ, వార్డు సచివాలయాల్లో స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు సాధించిన వారి సంఖ్య 50కి పైగా ఉండడం జిల్లాకే గర్వకారణం.

గ్రామీణ స్థాయి నుంచి..

గ్రామీణ స్థాయి నుంచి క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం జగనన్న స్పోర్ట్స్ క్లబ్ ఏర్పాటు చేసింది. క్రీడలపై అవగాహన పెంపొందించేలా సచివాలయ ఉద్యోగుల్లో ఒకరికి ప్రత్యేక జాబ్‌చార్ట్‌ను కేటాయించింది. ప్రతి నెలా క్రమం తప్పకుండా ముఖ్యమైన తేదీల్లో స్థానికంగా పోటీలు నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించింది. ఈ ఏడాది ప్రభుత్వం ఆడుదాం...ఆంధ్రా అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అక్టోబర్ 2 నుంచి ఈ పోటీలను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సంబరంగా జరుపనున్నారు.



కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో రూ.7 కోట్లతో నిర్మించిన యాస్ట్రో టర్ఫ్ హాకీ మైదానం

గుర్తు తెలియని వ్యక్తి దారుణ హత్య!

- వేమగిరిలో కలకలం
- మృతదేహాన్ని లేఅవుట్‌లో పడేసిన వైనం

కడియం: వేమగిరిలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతిచెందడం స్థానికంగా కలకలం రేపింది. ఆ మృతదేహంపై తీవ్ర గాయాలు ఉండడం, ఘటనా స్థలంలో లభించిన ఆధారాలను బట్టి పోలీసులు హత్యగా భావిస్తున్నారు. దీనిపై పోలీసుల కథనం ప్రకారం.. వేమగిరి వద్ద జాతీయ రహదారిపై ప్లాస్టిక్ పైపుల ఫ్యాక్టరీని ఆనుకుని ప్రైవేట్ లేఅవుట్ ఉంది. ఆదివారం ఉదయం సుమారు 60 ఏళ్ల వయసున్న పురుషుడి మృతదేహం అక్కడ ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. కడియం పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పీవీజీ తిలక్ ఆధ్వర్యంలో సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఆ మృతదేహం తలపై బలమైన వస్తువుతో కొట్టినట్లు గుర్తులు ఉన్నాయి. ఒంటిపై ఎటువంటి దుస్తులు లేవు. అంతే కాకుండా మృతదేహాన్ని ప్లాస్టిక్ సంచుల్లో పెట్టి కొంత దూరం లాక్కుంటూ వెళ్లి, వర్షపు నీటిలో పడేసినట్లు అక్కడి ఆనవాళ్లను బట్టి తెలుస్తోంది. మృతదేహానికి పక్కనే రక్తపు మరకలు ఉన్న రాయి ఉంది. ఈ నేపథ్యంలో ఇక్కడే హత్య చేశారా? లేక ఎక్కడైనా హత్య చేసి తీసుకువచ్చి ఇక్కడ పడేశారా? అనేది పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలానికి దక్షిణ మండల డీఎస్పీ శ్రీనివాసులు వచ్చి పరిశీలించారు. క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించారు. వీఆర్వో కుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కడియం పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రాత్రే హత్య జరిగిందా?

ఈ లేఅవుట్‌లో ఉదయం క్రికెట్ ఆడేందుకు, వాకింగ్ చేసేందుకు, డ్రైవింగ్ నేర్చుకునేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు వస్తుంటారు. రెండు రోజులుగా వర్షం పడుతుండడంతో ఆ ప్రాంతమంతా ముంపు నీరు నిలిచిపోయింది. ఉదయం కొద్దిమంది వచ్చి చూసేసరికి మృతదేహం ఉండడాన్ని గుర్తించి, పోలీసులకు సమాచారం అందించారు. రాత్రి సమయంలోనే ఈ హత్య జరిగి ఉంటుందని భావిస్తున్నారు. మృతుడి శరీరం పరిశీలిస్తే మురికి పట్టినట్లు ఉంది. దీంతో ఎవరైనా యాచకుడా? అనే సందేహం కూడా వ్యక్తం చేస్తున్నారు. సమీపంలోని టోల్‌గేట్‌లు, రహదారులపై ఉండే సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. దర్యాప్తు ముమ్మరం చేసినట్లు కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్ పీవీజీ తిలక్ తెలిపారు.

ఆన్‌లైన్ యాప్ పేరిట మోసం

- పోలీస్ స్టేషన్‌లో బాధితుల ఫిర్యాదు
- ఆ సంస్థ కంటైనర్‌ను ఆపి ఆందోళన



కంటైనర్‌ను నిలుపుదల చేసి ఆందోళన చేస్తున్న బాధితులు

నల్లజర్ల: ఆన్‌లైన్ చైన్ లింక్ యాప్‌లో రూ.లక్షల్లో పెట్టుబడులు పెట్టి మోసపోయామంటూ మండలంలోని బాధితులు ఆదివారం ఆందోళనకు దిగారు. వారు సొమ్ము చెల్లించిన యాప్‌కు సంబంధించిన మాయెర్క్స్ కంటైనర్ చెన్నై నుంచి కోల్‌కతా వెళ్తుండడంతో ఆ వాహనాన్ని నల్లజర్ల వద్ద బాధితులు నిలుపుదల చేసి ఆందోళనకు దిగారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు రంగ ప్రవేశం చేసి కంటైనర్‌ను పోలీస్ స్టేషన్‌కు తీసుకు వచ్చారు. ఈ మేరకు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ వివరాల ప్రకారం.. బాధితులు పోతవరానికి చెందిన కవులూరి రాజేష్, అనంతపల్లికి చెందిన మద్దాల మోషే, నబీపేటకు చెందిన మద్రి ప్రేమ్‌కుమార్, అచ్చన్నపాలేనికి చెందిన వట్టికూటి సీతారామకృష్ణ, ద్వారకాతిరుమల మండలం కప్పలగుంటకు చెందిన తూంపాటి శేఖర్‌లు మాయెర్క్స్ యాప్ ద్వారా డబ్బులు చెల్లించారు. రూ.1,600 ఈ సంస్థ యాప్‌లో పెడితే రోజూ లబ్ధిదారునికి 6 నెలల పాటు రూ.50 చొప్పున ఖాతాకు జమ చేస్తామని, రూ.18 వేలు కడితే రోజూ రూ.475 ఖాతాలకు అందిస్తామని సంస్థ నమ్మబలికింది. ఇలా ఆదాయం వస్తుందని అప్పులు చేసి మరీ రూ.లక్షల్లో ఈ యాప్‌లో పెట్టుబడులు పెట్టారు. గత కొంతకాలంగా ఈ వ్యవహారం సక్రమంగానే సాగింది. ఈ నెల 21 నుంచి యాప్ ఆగిపోయింది. దీంతో వీరంతా అయోమయానికి గురై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి

ఆలమూరు: మడికి శివారు నాగులపేటలో ఆదివారం విద్యుత్ షాక్ తగిలి బద్దపు లక్ష్మి (48) మృతి చెందింది. ఆలమూరు పోలీసుల కథనం ప్రకారం.. ఇంట్లో పనులు చేస్తుండగా ఆమెకు ప్రమాదవశాత్తూ విద్యుత్ తీగలు తగలడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యింది. ఆస్పత్రికి తరలించే లోపు మృతి చెందింది.

నేత్రపర్వం.. పవిత్రోత్సవం



పవిత్రోత్సవాల సందర్భంగా విశేష పూజలు నిర్వహిస్తున్న పండితులు



స్వామివారికి పట్టువస్త్రాలు తీసుకువస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి తదితరులు

ఆధ్యాత్మికతతో శోభిల్లిన వెంకన్న క్షేత్రం

ఆత్రేయపురం: వెంకన్న దివ్యక్షేత్రం ఆధ్యాత్మికతతో శోభిల్లింది.. భక్తజనం ఆ స్వామిని కొలిచి మురిసింది. కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో రెండో రోజు ఆదివారం పవిత్రోత్సవాలు కన్నుల పండువగా జరిగాయి. ఆలయ ప్రాంగణంలో పశ్చిమగోదావరి జిల్లా నడిపూడికి చెందిన వేద పండితుడు ఖండవల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో వేద పండితులు, అర్చకులు వేద మంత్రోచ్చారణ చేశారు. స్వామి వారికి పట్టు వస్త్రాలను కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, వైఎస్సార్ సీపీ నేత మేడపాటి శ్రీనివాసరెడ్డి, ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు చేతుల మీదుగా సమర్పించారు. తొలుత ఎమ్మెల్యే జగ్గిరెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పవిత్రోత్సవాల కార్యక్రమంలో పాల్గొని పవిత్రాలను భక్తులకు పంచారు. ఉదయం సుప్రభాత సేవ, పుణ్యాహవాచనం, నవ కలశారాధన, స్వామివారికి అభిషేకం, ప్రధాన హోమాలు, పవిత్ర సంప్రోక్షణ, నీరాజన మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి గోవింద నామస్మరణ చేయడంతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. అనంతరం భక్తులకు అన్నసమారాధన జరిగింది. ఈ ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, సిబ్బంది పర్యవేక్షించారు.

నేటితో పరిసమాప్తం

రెండు రోజుల నుంచి నిర్వహిస్తున్న స్వామివారి పవిత్రోత్సవాలు సోమవారంతో ముగియనున్నాయి. ఉదయం 8 గంటలకు సంకల్పం, మహాశాంతి హోమం, మహా పూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

క్రీడా సౌకర్యాల కల్పనే లక్ష్యం

- కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి
- ఉత్సాహంగా రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలు



విజేతకు మెడల్ అందజేస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ): రాష్ట్రంలో క్రీడా సౌకర్యాల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అన్నారు. జిల్లా తైక్వాండో సంఘం ఆధ్వర్యంలో కాకినాడ పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం 39వ రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల తైక్వాండో పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వీటిని ఎమ్మెల్యే ద్వారంపూడి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి 140 మంది క్రీడాకారులు హాజరుకావడం అభినందనీయమన్నారు. ప్రస్తుత కాలంలో తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పిల్లలు క్రీడల్లో రాణిస్తున్నారని, ఇది శుభపరిణామం అని అన్నారు. ఈ పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులు గెలుపు ఓటములను సమాన దృష్టితో చూడాలని తెలిపారు. రాష్ట్ర తైక్వాండో సంఘ కార్యదర్శి చంద్రమౌళి మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో బంగారు పతకం సాధించిన వారు వచ్చే నెలలో అసోం రాష్ట్రం గౌహతిలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. విజన్ హాస్పిటల్ అధినేత డాక్టర్ మహంతి మాట్లాడుతూ క్రీడలతో మంచి ఆరోగ్యం చేకూరుతుందన్నారు. పోటీల నిర్వహణ కార్యదర్శి లక్ష్మణ్ మాట్లాడుతూ సెప్టెంబర్ 8 నుంచి 10 వరకూ అసోం రాష్ట్రం గౌహతిలో జరిగే పోటీలకు 8 మంది పురుషులు, 8 మహిళలను రాష్ట్ర జట్టుగా ఎంపిక చేశామన్నారు. అనంతరం పోటీల్లో విజేతలకు ఎమ్మెల్యే ద్వారంపూడి మెడల్స్ అందజేశారు. అండర్–40 కిలోల నుంచి 80 కిలోల పైబడిన విభాగంలో పోటీలు నిర్వహించి రాష్ట్ర జట్టును జాతీయ స్థాయి పోటీలకు నిర్వాహకులు ఎంపిక చేశారు. కార్యక్రమంలో మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, మాజీ కార్పొరేటర్లు ఉదయ్‌కుమార్, బాబి, రాష్ట్ర తైక్వాండో సంఘ కోశాధికారి అబ్దుల్, పీఆర్ కళాశాల పీడీ డాక్టర్ రమణ, తైక్వాండో సంఘ సభ్యులు రాయుడు శ్రీనివాస్, బద్రి, సతీష్, రాజేష్ పాల్గొన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

పిఠాపురం: గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో ఆదివారం చెరువులో ప్రమాదవశాత్తూ పడి ఓ వ్యక్తి మృతి చెందినట్లు గొల్లప్రోలు ఎస్సై వినయ్ ప్రదీప్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. తాడిపర్తికి చెందిన లింగం సుబ్బారావు (34) ఆదివారం ఉదయం చెరువులో చేపలు పట్టడానికి దిగాడు. ఈ నేపథ్యంలో ప్రమాదవశాత్తూ జారి పడిపోయాడు. ఈ విషయం స్థానికుల నుంచి తెలుసుకున్న పిఠాపురం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ సంఘటనా స్థలానికి చేరుకుని అగ్నిమాపక సిబ్బంది సహాయంతో చెరువులో గాలించారు. చివరికి సుబ్బారావు మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వివరించారు.



సుబ్బారావు మృతదేహాన్ని తీసుకు వస్తున్న స్థానికులు